
## స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు నోటిఫికేషన్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పాఠశాలలో 2025–26 సంవత్సరానికి నాలుగో తరగతి ప్రవేశం కోసం నోటిఫికేషన్ విడుదలైంది. హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో ఉన్న స్పోర్ట్స్ స్కూల్స్‌లో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థులకు దరఖాస్తులను ఆహ్వానించారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం సాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి విడుదల చేశారు. 01-09-2016 నుంచి 30-8-2017 మధ్య జన్మించి 8 నుంచి 9 ఏండ్ల వయసు కలవారు అర్హులు. విద్యార్థులు ఈ వెబ్‌సైట్(www.tgss.telangana.gov.in) ద్వారా ఈనెల 7 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు.

## టెస్టు జట్టులోకి బ్రెవిస్

- జింబాబ్వే టూర్‌కు ఎంపిక



కేప్‌టౌన్: టీ20 క్రికెట్‌లో తనదైన షాట్లతో అలరిస్తూ 'బేబీ ఏబీడీ'గా గుర్తింపు పొందుతున్న దక్షిణాఫ్రికా యువ సంచలనం డెవాల్డ్ బ్రెవిస్‌కు ఆ దేశ క్రికెట్ బోర్డు బంపరాఫర్ ఇచ్చింది. త్వరలో ఆస్ట్రేలియాతో మొదలుకానున్న వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ ముగిసిన వెంటనే దక్షిణాఫ్రికా.. జింబాబ్వేతో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడనుండగా ఆ జట్టులో బ్రెవిస్‌కు చోటు కల్పించింది. జూన్ 28 నుంచి జరుగబోయే ఈ సిరీస్‌లో సీనియర్ ప్లేయర్లు మార్క్‌రమ్, దక్షిణాఫ్రికా సెలెక్టర్లు.. బ్రెవిస్‌తో పాటు లువాన్–డ్రి ప్రిటోరియస్‌కు చోటు కల్పించారు.

## ముంబై ఫాల్కన్స్ అదుర్స్

ముంబై: టీ20 ముంబై లీగ్‌లో శ్రేయాస్ అయ్యర్ సారథ్యంలోని సాబో ముంబై ఫాల్కన్స్ టీమ్ 4 వికెట్ల తేడాతో సూర్యకుమార్‌యాదవ్ కెప్టెన్సీలోని ట్రింఫ్ నైట్స్ ముంబై నార్త్‌ఈస్ట్‌పై అద్భుత విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన నైట్స్ 20 ఓవర్లలో 145/5 స్కోరుకే పరిమితమైంది. సూర్యకుమార్(1) ఘోరంగా నిరాశపరిచాడు. లక్ష్యఛేదనలో రఘువంశీ(42, వినాయక్(33), ఆకాశ్ పార్కర్(30 నాటౌట్) రాణించడంతో ఫాల్కన్స్ విజయం వైపు నిలిచింది.

# టైటిల్ పోరుకు అల్కరాజ్

### సెమీస్‌లో ముసెట్టిపై విజయం

### గాయంతో వెనుదిరిగిన ఇటలీ సంచలనం

### మహిళల ఫైనల్‌లో గాఫ్ X సబలెంక




పారిస్: ప్రతిష్టాత్మక ఫ్రెంచ్ ఓపెన్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన స్పెయిన్ నయా బుల్ కార్లోస్ అల్కరాజ్.. ఈ టోర్నీలో వరుసగా రెండో ఫైనల్‌కు దూసుకెళ్లాడు. శుక్రవారం ఫిలిప్పీ చార్టర్ వేదికగా జరిగిన పురుషుల సింగిల్స్ తొలి సెమీస్‌లో రెండో సీడ్ అల్కరాజ్ 4–6, 7–6 (7/3), 6–0, 2–0తో ఇటలీ యువ సంచలనం లొరెంజో ముసెట్టిని చిత్తు చేసి టైటిల్ పోరుకు సిద్ధమయ్యాడు. ఇరువురి మధ్య సుమారు రెండున్నర గంటల పాటు సాగిన హోరాహోరీ పోరులో తొలి సెట్ కోల్పోయినప్పటికీ అల్కరాజ్ తర్వాత అద్భుతంగా పుంజుకుని వరుస సెట్లలో నెగ్గి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో సెట్ ఏకంగా 67 నిమిషాలు సాగగా.. టై బ్రేక్‌లో అల్కరాజ్ జోరు కొనసాగించి సెట్‌ను గెలుచుకున్నాడు. మ్యాచ్‌పై పట్టు చిక్కాక ఈ స్పెయిన్ కుర్రాడు వెనుదిరగలేదు. మూడో సెట్ ఏకపక్షంగా సాగింది. విజయానికి ఒక్క సెట్ దూరంలో నిలిచిన అతడు.. నాలుగో సెట్‌లో 2–0 ఆధిక్యంతో ఉండగా ముసెట్టి కాలికి గాయమైంది. దీంతో అతడు ఆట మధ్యలోంచే తప్పుకోవడంతో అల్కరాజ్ ఫైనల్‌కు అర్హత సాధించాడు. గ్రాండ్‌స్లామ్ ఈవెంట్స్‌లో అల్కరాజ్‌కు ఇది ఐదో ఫైనల్. సెమీస్‌లో అల్కరాజ్ 35 విన్నర్లు కొట్టగా ముసెట్టి 22 సాధించాడు. అంచనాలే లేకుండా బరిలోకి దిగిన ముసెట్టి.. ప్రిక్వార్టర్స్‌లో రూనెతో పాటు క్వార్టర్స్‌లో టియాఫో (అమెరికా) వంటి స్టార్ ప్లేయర్లకు షాకిచ్చి సెమీస్‌లో అల్కరాజ్‌కు తీవ్ర పోటీనిచ్చినా గాయం కారణంగా వెనుదిరగాల్సి వచ్చింది. పురుషుల సింగిల్స్‌లో భాగంగా సిన్నర్ (ఇటలీ), జొకోవిచ్ (సెర్బియా) మధ్య జరిగే రెండో సెమీస్‌లో గెలిచే విజేతతో అల్కరాజ్ టైటిల్ పోరులో అమీతుమీ తేల్చుకోనున్నాడు.

### గాఫ్ X సబలెంక




మహిళల సింగిల్స్‌లో ఫ్రెంచ్ ఓపెన్ కొత్త చాంపియన్‌ను చూడబోతున్నది. మూడేండ్ల క్రితం ఈ టోర్నీ ఫైనల్ చేరి తృటిలో టైటిల్ కోల్పోయిన అమెరికా అమ్మాయి, రెండో సీడ్ కోకో గాఫ్.. మరోసారి పట్టువదలకుండా ఫైనల్ చేరింది. గురువారం రాత్రి జరిగిన మహిళల సింగిల్స్ రెండో సెమీస్‌లో గాఫ్ 6–1, 6–2తో ఫ్రాన్స్ సంచలనం బోయిసన్‌ను మట్టికరిపించి టాప్ సీడ్ అరీనా సబలెంకతో టైటిల్ పోరుకు సిద్ధమైంది. వైల్డ్ కార్డ్ ఎంట్రీతో ఈ టోర్నీలో సంచలన విజయాలు సాధించిన బోయిసన్.. కీలక మ్యాచ్‌లో మాత్రం గాఫ్ జోరు ముందు తేలిపోయింది. ఇక ముఖాముఖి పోరులో గాఫ్, సబలెంక 5–5తో సమంగా ఉన్నారు. ఫైనల్‌లో మట్టికోర్టు మహారాణిగా నిలిచేదెవరనేది శనివారం తేలనుంది.

## గుకేశ్ గెలుపు జోరు | నార్వే చెస్ టోర్నీ



స్టావెంజర్(నార్వే): ప్రతిష్టాత్మక నార్వే చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ వరుస విజయాల జోరు కొనసాగుతున్నది. శుక్రవారం జరిగిన తొమ్మిదో రౌండ్‌లో గుకేశ్..చైనాకు చెందిన వీ యిని ఓడించి మూడు పాయింట్లు ఖాతాలో వేసుకుని కార్ల్‌సన్(15) తర్వాత 14.5 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. శనివారం జరిగే ఆఖరి రౌండ్‌లో గుకేశ్..అమెరికా జీఎం ఫాబియానో కరువనతో తలపడనుండగా, కార్ల్‌సన్..అర్జున్‌ను ఢీకొననున్నాడు. టోర్నీలో విజేతగా నిలిచే వారికి టైటిల్‌తో పాటు 59 లక్షల ప్రైజ్‌మనీ దక్కనుంది. ఒకవేళ డిఫెండింగ్ చాంపియన్ కార్ల్‌సన్ గెలిస్తే అతనికిది ఏడో టైటిల్ కానుంది. మరో వైపు కెరీర్‌లో తొలిసారి నార్వే టైటిల్ దక్కించుకోవాలన్న పట్టుదలతో గుకేశ్ కనిపిస్తున్నాడు. దీంతో ఆఖరి గేమ్ టోర్నీ విజేతను నిర్ణయించనుంది.

## సాత్విక్ జోడీ ఔట్



జకార్తా: ఇండోనేషియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ఆశలు మోస్తున్న సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి ద్వయం పోరాటం క్వార్టర్స్‌లోనే ముగిసింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్‌లో ఈ జోడీ 19–21, 16–21తో మలేషియాకే చెందిన మన్ వీ చోంగ్–టీ కై వున్ చేతిలో అపజయం పాలయ్యింది. 2023లో ఈ టోర్నీ పురుషుల డబుల్స్ టైటిల్ కైవసం చేసుకున్న భారత జంట.. తాజా ఎడిషన్‌లో మాత్రం ఆ మ్యాజిక్‌ను పునరావృతం చేయలేకపోయింది. 43 నిమిషాల్లోనే ముగిసిన క్వార్టర్స్‌లో మలేషియా కుర్రాళ్లు.. వరుస గేమ్స్‌ను గెలుచుకుని సెమీస్‌కు దూసుకెళ్లారు.

## చావ్లా రిటైర్మెంట్ | క్రికెట్‌కు వీడ్కోలు పలికిన భారత మాజీ స్పిన్నర్



ఢిల్లీ: వెటరన్ లెగ్ స్పిన్నర్ పియూష్ చావ్లా తన సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. రెండు దశాబ్దాల పాటు ఆటలో కొనసాగిన చావ్లా.. శుక్రవారం అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో స్పందిస్తూ.. 'రెండు దశాబ్దాల తర్వాత ఈ అందమైన ఆటకు వీడ్కోలు పలకాల్సిన సమయం వచ్చింది. నేను ఆట నుంచి వైదొలుగుతున్నా క్రికెట్ మాత్రం ఎప్పటికీ నాతోనే ఉంటుంది' అని అన్నాడు. త్వరలోనే కొత్త ప్రయాణం మొదలుపెడతానని చెప్పిన అతడు.. అదేంటన్నది మాత్రం స్పష్టం చేయలేదు. కాగా 2007 టీ20 ప్రపంచకప్, 2011 వన్డే ప్రపంచకప్ గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్న చావ్లా.. భారత్ తరఫున మూడు టెస్టులు, 25 వన్డేలు, ఏడు టీ20లు ఆడి 43 వికెట్లు పడగొట్టాడు. జాతీయ జట్టులో పెద్దగా మెరవకపోయినా ఐపీఎల్‌లో మాత్రం చావ్లాది ప్రత్యేక స్థానం. ఈ లీగ్‌లో 192 మ్యాచ్‌లు ఆడిన అతడు.. 192 వికెట్లు పడగొట్టాడు.

## వ్యక్తిగత విభాగాల్లోనూ తప్పని నిరాశ

- స్టేజ్-3 ఆర్చరీ ప్రపంచకప్



అంటాల్య (టర్కీ): ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్–3లో భారత ఆర్చర్ల వైఫల్య ప్రదర్శన కొనసాగుతున్నది. కాంపౌండ్, రికర్వ్ టీమ్ ఈవెంట్స్‌లో నిరాశపరిచిన మన ఆర్చర్లు.. కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలోనూ తేలిపోయారు. శుక్రవారం జరిగిన మహిళల కాంపౌండ్ వ్యక్తిగత క్వార్టర్స్‌లో మధుర ధమన్గోంకర్.. 152–159తో మెక్సికో ఆర్చర్ మరియన బెర్నల్ చేతిలో ఓడింది. వరల్డ్ చాంపియన్ అదితి స్వామి 147–152తో మెక్సికోకు చెందిన రెండో సీడ్ ఆండ్రియా బెకెర్రా గురి ముందు తేలిపోయింది. పురుషుల విభాగంలో 13వ సీడ్ రిషభ్.. 149–157తో ఫ్రాన్స్ విలుకాడు నికోలస్‌కు తలవంచాడు. ఒజాస్.. 157–161తో జేమ్స్ లుట్జ్ (అమెరికా) చేతిలో ఓడాడు. గత నెలలో షాంఘైలో ముగిసిన ప్రపంచకప్ స్టేజ్–2 పతకాల పట్టికలో రెండో స్థానంలో నిలిచిన భారత్.. అంటాల్యలో మాత్రం ఇంత వరకూ బోణీ కొట్టలేదు. ఈ నేపథ్యంలో శనివారం జరుగనున్న రికర్వ్ ఆర్చర్ల మీదే భారత్ ఆశలు పెట్టుకుంది.

## రాహుల్ సెంచరీ | భారత్ 253/5




నార్తాంప్టన్: ఇంగ్లండ్‌తో కీలక ఐదు టెస్టుల సిరీస్‌కు ముందు భారత స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ తాను ఆడిన తొలి ప్రాక్టీస్ మ్యాచ్‌లోనే అదరగొట్టాడు. ఇంగ్లండ్ లయన్స్‌తో జరుగుతున్న రెండో అనధికారిక టెస్టులో భాగంగా శుక్రవారం మొదలైన మ్యాచ్‌లో రాహుల్.. (168 బంతుల్లో 116, 15 ఫోర్లు, 1 సిక్స్) శతకంతో కదంతొక్కగా ధ్రువ్ జురెల్ (52), కరుణ్ నాయర్ (40) రాణించారు. ఈ త్రయం మెరవడంతో మూడు సెషన్ల ఆట ముగిసే సమయానికి భారత్.. 62 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 253 పరుగులు చేసింది. టెస్టులలో రోహిత్ శర్మ రిటైర్మెంట్‌తో ఖాళీ అయిన ఓపెనర్ స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారన్న అనుమానాలను నివృత్తి చేస్తూ రాహుల్ సెంచరీతో బదులివ్వడంతో రాబోయే సిరీస్‌లో అతడినే ఓపెనర్‌గా పంపే అవకాశాలు మరింత మెరుగయ్యాయి. గత మ్యాచ్‌లో సెంచరీతో రాణించిన కరుణ్ నాయర్ సైతం రెండో మ్యాచ్‌లోనూ మెరవడంతో ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ తుది జట్టులోనూ అతడికి చోటు దక్కే అవకాశముంది.

## మా నాన్న నిరాశకు లోనయ్యారు: రోహిత్ శర్మ



ముంబై: కొద్దిరోజుల క్రితమే టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించి అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసిన భారత టెస్టు మాజీ సారథి రోహిత్ శర్మ.. తన నిర్ణయం అభిమానులతో పాటు తన తండ్రి(గురునాథ్ శర్మ)నీ నిరాశకు గురిచేసిందని అన్నాడు. పుజారా సతీమణి పూజ రాసిన 'ది డైరీ ఆఫ్ ఏ క్రికెటర్స్ వైఫ్' బుక్ లాంచింగ్ కార్యక్రమంలో పాల్గొన్న రోహిత్ మాట్లాడుతూ.. ''మా నాన్న ఒక ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో పని చేసేవారు. నా తల్లి లాగే తండ్రి కూడా ఎన్నో త్యాగాలు చేశారు. ఆయన టెస్టులకు వీరాభిమాని. వన్డేలలో నేను రికార్డు స్కోరు (264) చేసినప్పుడు 'ఓకే. బాగా ఆడావు' అన్నారే తప్ప పెద్దగా ఎగ్జైట్ కాలేదు' అని రోహిత్ అన్నాడు.

చిత్రం





## అక్కినేని ఇంట పెళ్లిబాజా

*యువ హీరో అక్కినేని అఖిల్ బ్యాచిలర్ లైఫ్‌కు గుడ్‌బై చెప్పేసి, వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టారు. తన స్నేహితురాలు జైనబ్ రవ్జీతో ఆయన వివాహం శుక్రవారం అక్కినేని నాగార్జున నివాసంలో ఘనంగా జరిగింది. కుటుంబ సభ్యులతోపాటు నాగార్జునకు అత్యంత సన్నిహితులైన చిరంజీవి కుటుంబం కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. దర్శకుడు ప్రశాంత్ నీల్, శర్వానంద్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు ఈ వివాహానికి హాజరై నూతన వధూవరులకు ఆశీర్వచనాలు అందించారు. అఖిల్ పెళ్లి ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ నెల 8న హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోస్‌లో రిసెప్షన్ జరుగనున్నది.*

# వీరమల్లు..మళ్లీ వాయిదా!



కొద్దిరోజులుగా ఇండస్ట్రీ సర్కిల్స్‌లో జరుగుతున్న ప్రచారాన్ని నిజం చేస్తూ 'హరిహరవీరమల్లు' చిత్రం మరోమారు వాయిదా పడింది. ఈ విషయాన్ని శుక్రవారం చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా ఎం.ఎం.జ్యోతికృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో ఎ.దయాకర్ రావు ఈ చిత్రాన్ని నిర్మించారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 12న ఈ సినిమా విడుదల కావాల్సి ఉంది. గ్రాఫిక్ వర్క్స్‌లో జాప్యం కారణంగా రిలీజ్ వాయిదా పడినట్లు సమాచారం. సినిమాలోని ప్రతీ సన్నివేశాన్ని గొప్పగా తీర్చిదిద్దే ప్రయత్నంలో నిమగ్నమై ఉన్నందున రిలీజ్‌ను వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. 'కష్టమైనప్పటికీ తప్పనిసరై ఈ నిర్ణయాన్ని తీసుకోవాల్సి వచ్చింది. ఈ చిత్రాన్ని మరింత గొప్పగా మలచాలన్నదే మా ప్రయత్నం. అందుకే కొంత సమయం తీసుకుంటున్నాం. మీ ఎదురుచూపులకు బహుమతిగా అద్భుతమైన చిత్రాన్ని అందిస్తాం. త్వరలో థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేస్తాం. కొత్త తేదీని కూడా ప్రకటిస్తాం' అని చిత్రబృందం ప్రకటనలో పేర్కొంది. మొఘల్ కాలం నాటి ఈ కథలో పవన్‌కల్యాణ్.. పెద్దల దగ్గర సంపదను కొల్లగొట్టి పేదలకు పంచే బందిపోటు దొంగ వీరమల్లు పాత్రలో కనిపించనున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం.కీరవాణి సంగీతాన్నందిస్తున్నారు. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: జ్ఞానశేఖర్ వీఎస్, మనోజ్ పరమహంస.



## ఇంటికి రావడం తనకిష్టం లేదు!

కమల్ ముద్దుల తనయ శ్రుతిహాసన్ ప్రస్తుతం అటు ఆనందానికీ ఇటు బాధకీ మధ్య కొట్టుమిట్టాడుతున్నది. దానికి కారణం తన పెంపుడు పిల్లి. దాని పేరు 'కోరా'. కొన్ని రోజుల క్రితం ఆ పిల్లి తప్పిపోవడంతో.. ఆ విషయాన్ని తన ఇన్‌స్టా ద్వారా అభిమానులతో పంచుకొని బాధను వ్యక్తం చేసింది శ్రుతిహాసన్. రీసెంట్‌గా ఆ పిల్లి తనకు తారసపడిందట. ఈ విషయం గురించి తాజా పోస్ట్‌లో స్పందిస్తూ.. 'కోరా మళ్లీ కనిపించింది. నిజంగా అది కనిపించగానే చెప్పలేనంత సంతోషం కలిగింది. అయితే.. బక్కచిక్కిపోయిన దాని స్థితిని చూస్తే బాధేసింది. ఇంటికి తీసుకెళ్లడానికి ట్రై చేశాను. కానీ తను రాలేదు. కోరాకు ఇంటికి రావడం ఇష్టం లేదు. తన ప్రపంచంలో తానుండాలని కోరా కోరుకుంటున్నది. తను కనిపించినందుకు ఆనందించాలో, ఇంటికి రావడానికి ఇష్టపడనందుకు బాధపడాలో అర్థం కావడంలేదు. ఏదేమైనా ఓ పెట్‌కి సంరక్షకురాలిగా ఉండటం నిజంగా సవాల్.' అంటూ చెప్పుకొచ్చింది శ్రుతిహాసన్.

## వినోదాల 'మిత్రమండలి'



ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మిత్ర మండలి'. విజయేందర్ ఎస్ దర్శకుడు. బన్నీ వాసు సమర్పణలో రూపొందుతున్నది. శుక్రవారం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఈ సినిమా ద్వారా సోషల్‌మీడియా ఫేమ్ నిహారిక ఎన్.ఎం. తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇస్తున్నది. స్నేహం ప్రధానంగా నడిచే కథ ఇదని, నలుగురు మిత్రులు చేసే హంగామా ఆద్యంతం నవ్వుల్ని పంచుతుందని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సిద్ధార్థ్ ఎస్.జె, సంగీతం: ఆర్.ఆర్.ధృవన్, నిర్మాతలు: కల్యాణ్ మంతిన, భానుప్రతాప, డా॥ విజయేందర్ రెడ్డి, దర్శకత్వం: విజయేందర్ ఎస్.

## మారేడుమిల్లిలో మోగ్లీ పోరాటాలు




రోషన్ కనకాల కథానాయకుడిగా సందీప్ రాజ్ దర్శకత్వంలో రూపొందుతోన్న లవ్ అండ్ యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. మారేడుమిల్లి ఫారెస్ట్‌లో రీసెంట్‌గా బిగ్ క్లైమాక్స్ యాక్షన్ షెడ్యూల్‌ని పూర్తి చేశారు. 15రోజుల పాటు జరిగిన ఈ షెడ్యూల్‌లో రోషన్ కనకాల చేసిన రిస్క్‌తో కూడుకున్న యాక్షన్ స్టంట్స్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తాయని మేకర్స్ చెబుతున్నారు. ఇంకో షెడ్యూల్‌తో చిత్రీకరణ పూర్తవుతుందని, ఈ నెలలోనే టీజర్‌ని కూడా విడుదల చేస్తామని వారు తెలిపారు. సాక్షి మడోల్కర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో బండి సరోజ్‌కుమార్ కీలక పాత్రధారి. ఈ చిత్రానికి సంగీతం: కాలభైరవ.



## బ్యాచిలర్స్ ప్రేమకథలు

గీతా సింగ్, కార్తీక్, కాశీ మదన్, ఇషాని, చలానా అగ్నిహోత్రి, శృతి లయ ప్రధాన పాత్రధారులుగా ఎంఎన్వీ సాగర్ స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న 'బ్యాచిలర్స్ ప్రేమ కథలు' చిత్రం షూటింగ్ ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు వి.సముద్ర కెమెరా స్విఛాన్ చేయగా, మరో దర్శకుడు వీరశంకర్ క్లాప్ ఇచ్చారు. వినోదంతోపాటు సోషల్ మెసేజ్ కూడా ఈ సినిమాలో ఉంటుందని, ఈ నెలలోనే షూటింగ్ స్టార్ట్ చేసి, ఈ ఏడాదే సినిమాను విడుదల చేస్తామని దర్శక, నిర్మాత ఎంఎన్వీ సాగర్ తెలిపారు. ఇంకా ప్రధాన పాత్రధారులంతా మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: ప్రసాద్ ఎస్, సంగీతం: మెరుగు అరమాన్, నిర్మాణం: ఎస్ఎం4 ఫిల్మ్స్.

## పెద్ద హీరోలు.. కాస్త ఆలోచించండి



థియేటర్లలో విడుదలైన నెలలోపే సినిమాలను ఓటీటీలోకి స్ట్రీమింగ్‌కు తీసుకురావడం వల్ల భవిష్యత్తులో సింగిల్ స్క్రీన్ థియేటర్లు మూతపడే ప్రమాదం ఉందని నిర్మాత బన్నీ వాసు ఆందోళన వ్యక్తం చేశారు. నిర్మాతలు, ఎగ్జిబిటర్లు పర్సంటేజీ విధానంపై కాకుండా ప్రేక్షకులను థియేటర్లకు రప్పించి, ఆక్యుపెన్సీ పెంచే దిశగా కృషి చేయాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన సోషల్‌మీడియా ఖాతాల్లో ఓ పోస్ట్‌పెట్టారు. 'ఇప్పుడున్న అర్ధ రుపాయి బిజినెస్‌లో నీది పావలా, నాది పావలా అని కొట్టుకోవడం కాదు. గతంలో మాదిరిగా మన వ్యాపారాన్ని రూపాయికి ఎలా తీసుకెళ్లాలనేది ఆలోచించాలి. సినిమా రిలీజైన 28రోజుల్లోపే ఓటీటీకి ఇవ్వాలనే ట్రెండ్ కొనసాగితే రాబోయే నాలుగైదు సంవత్సరాల్లో 90శాతం సింగిల్ స్క్రీన్ థియేటర్లు మూతపడతాయి. పెద్ద హీరోలు రెండుమూడు సంవత్సరాలకో సినిమా చేస్తూ పోతే థియేటర్ల నుంచి ప్రేక్షకులు దూరమైపోతారు. వాటి యజమానులు కూడా థియేటర్లను మూసేస్తారు. మల్టీప్లెక్స్ థియేటర్ల ద్వారా వచ్చే ఆదాయంలో కేవలం 43 శాతం మాత్రమే నిర్మాతలకు వెళ్తుంది. ఈ విషయాన్ని పెద్ద హీరోలు గుర్తుంచుకోవాలి' అని బన్నీ వాసు పేర్కొన్నారు.

## వన సంరక్షణ నేపథ్యంలో కలివి వనం



రఘుబాబు, నాగదుర్గ, సమ్మెట గాంధీ, విజయలక్ష్మి, బిత్తిరి సత్తి, బలగం సత్యనారాయణ, మహేంద్రనాథ్, శ్రీచరణ్, అశోక్ ప్రధాన పాత్రలు పోషించిన తెలంగాణ గ్రామీణ నేపథ్య చిత్రం 'కలివి వనం'. రాజ్ నరేంద్ర దర్శకుడు. మల్లికార్జున్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి నిర్మాతలు. ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. గురువారం టీజర్‌ని విడుదల చేశారు. 'వర్షం ఎలా వస్తుందని పిల్లలు అడిగితే, ఆకాశం నుంచి అని కాకుండా, చెట్ల వల్లే వర్షం వస్తుందని చెప్పాలి. అప్పుడే చెట్ల విలువ బాల్యం నుంచీ అందరికీ అర్థమవుతుంది. ఈ నీతిని తెలియజేసేలా.. వన సంరక్షణ అనే కాన్సెప్ట్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది' అని దర్శకుడు రాజ్ నరేంద్ర చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: మదీన్ ఎస్కే, పాటలు: కాసర్ల శ్యామ్, మట్లా తిరుపతి, కమల్ ఇస్లవంత్.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.